## సర్వ జీవులయందున్న చైతన్యతత్త్వమే శివత్వము

**మౌళి గుల్కెడు చంద్రమఃఖండ కళతోడ**
**బెడగారు గుంపెడు జడలతోడ**
**జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ**
**డంబైన ఫాలనేత్రంబుతోడ**
**నల్ల నేరెడువంటి నల్లని మెడతోడ**
**కరమున నాగ కంకణముతోడ**
**నడుమున చుట్టిన నాగచర్మముతోడ**
**మైనిండనలదు భస్మంబుతోడ**
**నుదుట దీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో**
**తాంబూల రాగాధరంబు తోడ**
**ఆరు శాస్త్రములందున నందగించి**
**నల్ల కలువల హసియించి కొల్లలాడు**
**మెరుగు చామన చాయల మేనితోడ**
**పర్తివాసుడు నేడు సాక్షాత్కరించె**

*ప్రేమస్వరూపులారా!* శివరాత్రి అనగా ఏమిటో గుర్తించడానికి మీరు ప్రయత్నించాలి. 'శివము' అనగా మంగళకరమైనది. కనుక, శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. శివుడనగా ఎవరు? సర్వజీవుల యందు సంచరించెడి చైతన్యమే శివుడు. కేవలము మానవులయందు మాత్రమే కాకుండా పశు, పక్షి, మృగాదులయందుకూడా శివత్వము ప్రజ్వరిల్లుతూనే ఉన్నది. శివరాత్రి నిమిత్తం మనము ఒక సంవత్సరము కాచుకోనక్కరలేదు. ప్రతి దినమును శివరాత్రిగానే భావించి పవిత్రంగా గడపాలి. శివుని చైతన్యమే సర్వత్రా ప్రజ్వరిల్లుతున్నది. ఇట్టి శివత్వమును ఒక ప్రదేశానికి, ఒక కాలానికి పరిమితం చేయడం అజ్ఞానం. ఎక్కడ చూసినప్పటికీ ఉన్నది అదొక్కటే.

'సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరోముఖం
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి'

చక్కగా విచారణ చేసి చూసిన, మనకు కనిపించే దంతయు శివత్వమే. శివుడనగా కేవలము జటా జూటము ధరించినవాడు కాదు. బాలునియందుగాని, వృద్ధునియందుగాని, స్త్రీయందుగాని, పురుషుని యందుగాని ప్రతి ఒక్కరియందు శివత్వమే తాండవ మాడుచున్నది. ఇట్టి శివత్వమునకు మీరు ఒక ప్రత్యేకమైన రూపమును ఏవిధంగా నిర్ణయించగలరు! ఈనాటి బాలబాలికలు శివతాండవము పేరిట నృత్యము చేస్తుంటారు. అది కేవలము ఒక చిహ్నము మాత్రమేగాని, సత్యమైన స్వరూపము కాదు. మనకు రెండు కన్నులున్నాయి. శివునికి మూడవ కన్నుకూడా ఉన్నది. దీని అంతరార్థమేమిటి? మనము Past (గతము), Present (వర్తమానము) ఈ రెండింటినీ మాత్రమే చూడగలముకాని, Future (భవిష్యత్తు)ను చూడలేము. శివుడు భవిష్యత్తునుకూడా చూస్తాడు. కనుకనే, శివుణ్ణి 'ముక్కంటివేల్పు' అని వర్ణిస్తుంటారు. అవాఙ్మానసగోచరమైన, కాలాతీతమైన ఇట్టి శివ తత్త్వాన్ని ఎవరు వర్ణించగలరు! ఎవరు ఎన్ని విధాలుగా వర్ణించినప్పటికీ అది పరిపూర్ణమైన వర్ణన కానేరదు.

### సర్వం శివమయం

మానవులు వారివారి భావాలను పురస్కరించుకొని దైవానికి ఆయా రూపనామములను కల్పించు కుంటున్నారు. ఎట్టి భావమో అట్టి రూపము. ఎట్టి భావమో అట్టి గుణము. అయితే, భగవంతుడు ఎక్కడ చూసినా ఉన్నాడు. కాని, కంటికి కనిపించడు. తాను అప్రమేయుడు, అవాఙ్మానసగోచరుడు. సర్వజీవులలో ఉన్న చైతన్యమే దైవత్వము. దానినే 'కాన్షియస్‌నెస్' అన్నారు. అది ఏ రూపాన్నైనా ధరించవచ్చు – కుక్క రూపము ధరించవచ్చు; కాకి రూపము ధరించవచ్చు; కొంగ రూపము ధరించవచ్చు; మానవరూపము ధరించవచ్చు. ఇటువంటి దైవత్వాన్ని ఇట్టిది, అట్టిది అని ఎవరు వర్ణించగలరు! కేవలం మానవునియందు మాత్రమే కాదు; క్రిమికీటకాదులయందు, పశుపక్షి మృగాదులయందుకూడా చైతన్యము వున్నది. ఆ చైతన్యమునకే 'శివత్వము' అని పేరు పెట్టారు. శివుడనగా ముక్కంటివేల్పు అని, త్రిశూలధారియని పేర్లు పెడుతున్నారేగాని, ఇవన్నీ సరియైన

వర్ణనలు కావు. సర్వులయందు కనిపించే చైతన్యతత్త్వమే శివత్వము. ఇప్పుడు ఈ హాలులో కూర్చున్న మీరందరూ శివస్వరూపులే! 'సర్వం శివమయం.' ఇటువంటి శివ మయమైన తత్త్వాన్ని వర్ణించడం అసాధ్యం.

**ప్రేమయే శివత్వము**

త్రిలోకములందు, త్రికాలములందు కనిపించేది శివత్వమే! భూత, భవిష్యత్, వర్తమానములందు మార్పు చెందనిది శివత్వము. ఇట్టి తత్త్వమునకు అనేకమంది అనేకవిధములైన రూపనామములు కల్పించి పూజిస్తూ వస్తున్నారు. ప్రేమయే శివత్వము. మీ అందరిలోనూ ప్రేమ ఉన్నది. ప్రేమకు తన, పర అనే భేదము లేదు. కాని, మీరు తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి... ఈరకమైన సంబంధ బాంధవ్యములను ఏర్పరచుకొని మీ ప్రేమను సంకుచితం చేసుకుంటున్నారు. ఈ సంబంధ బాంధవ్యములన్నీ కేవలం మీ కల్పనలేగాని, సత్యమైనవి కావు. ప్రతి ఒక్కరిలోనూ భగవంతు డున్నాడు. భగవంతుడే అన్ని రూపనామములను ధరించాడు. భగవత్ చైతన్యము సర్వజీవులయందు సంచరిస్తున్నది. నరనరములందు, కణకణములందు చైతన్యమున్నది. ఇది ఎట్లా ఉంటుందని ప్రశ్నిస్తారు కొంతమంది. ఇది కేవలం అనుభూతికి మాత్రమే అర్థ మౌతుంది. సర్వజీవులయందు సర్వత్రా వ్యాపించి ఉన్న శివత్వముకొరకు ఎక్కడెక్కడో వెతకడం ఎంతటి వెఱ్ఱితనము! అక్కడ, ఇక్కడ, ఎక్కడ చూసినా ఒక్కడే ఆత్మస్వరూపుడై అంతటా నిండియున్నాడు. సర్వత్రా సంచరించే చైతన్యశక్తియే ఈశ్వరత్వము.

"మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ బెడగారు గుంపెడు జడలతోడ...." శివుడు తన కురులకు ఎప్పుడూ సంస్కారము చేయలేదు. ఎట్లా పుట్టిన వెంట్రుకలను అట్లాగే వదిలాడు. తన దేహమునకు కూడా సంస్కారము చేయలేదు. ఒకానొక సమయంలో సరస్వతి, లక్ష్మి, పార్వతి ఈ ముగ్గురూ ఒకచోట కలుసుకున్నారు. ముగ్గురాడవారు ఒకచోట చేరారంటే మూడు రకములైన మాటలు బయలుదేరతాయి. ఆ సమయంలో లక్ష్మికి, పార్వతికి మధ్య చిన్న జగడం జరిగింది. "అమ్మా, పార్వతీ! నీ భర్త తన దేహానికి ఎట్టి సంస్కారమూ చేసుకోకుండా సంచరిస్తున్నాడు. అలాంటివానిని నీవు ఏవిధంగా వరించావు?" అని అడిగింది లక్ష్మి. అప్పుడు పార్వతి, "అమ్మా, లక్ష్మీ! నీ భర్త నీలంగా ఉంటున్నాడు కదా! అతని రంగును నీవు మార్చకూడదా?" అన్నది. సరస్వతి మధ్యలో కలుగజేసుకుంటూ, "రూపములలో కొన్ని భేదములు ఉండవచ్చునుగాని, నా దృష్టిలో ఇరువురూ సమానులే! వారిలో నాకు భేదములు ఏమాత్రము కనిపించవు. మీరిద్దరూ ఇలా జగడం వేసుకుంటే జగత్తులో అనేక రకములైన భేదభావాలు తలెత్తుతాయి. కాబట్టి, మీరు భేదములను పూర్తిగా త్యజించండి", అని వారికి సమత్వాన్ని బోధించింది.

**భగవంతుడు ఎప్పుడూ శాంతస్వరూపుడే!**

భగవంతునియొక్క గుణాతీతతత్త్వాన్ని అనేక పురాణాలు ప్రకటిస్తూ వచ్చాయి. భగవంతునిలో కనిపించే భేదములన్నీ భక్తులయొక్క కల్పనలే! అవన్నీ మన భావములో ఉన్న భేదములే తప్ప భగవంతునిలో ఎలాంటి భేదములూ లేవు. ఎట్టి భావమో అట్టి బ్రహ్మము. మన భ్రమలను బట్టి బ్రహ్మమును మార్చకూడదు. కొందరు భగవంతుణ్ణి రుద్రునిగాను, శాంతస్వరూపునిగాను వర్ణిస్తుంటారు. అయితే, భగవంతుడు ఎప్పుడూ శాంతస్వరూపుడేగాని, రుద్రుడు కాదు. భగవంతుని మోముపై నిరంతరము చిరునవ్వులు చిందులు త్రొక్కుతూ ఉంటాయి. అటువంటి భగవంతుణ్ణి మీరు వివిధరకములుగా చూస్తున్నారంటే... అవన్నీ మీయొక్క భావరూపములే గాని, భగవంతునియొక్క స్వరూపములు కావు. ఈ భేదములకు కారణం మీ సంకల్పములే తప్ప అన్యము కాదు. కాబట్టి, మీయందున్నటువంటి భేదములను ప్రక్కకు త్రోసివేయాలి; భేదరహితమైనటువంటి దైవమును చూడాలి. 'డివైన్' (దైవత్వము) ఒక్కటేగాని, రెండు కాదు. కాని, ఈ కలిప్రభావముచేత ప్రజలు లౌకికమైన భ్రాంతులనే 'డీప్ వైన్'ను సేవించడంచేత 'డివైన్'ను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. కేవలము మానవులయొక్క భ్రమలచేతనే అనేక రకములైన రూపనామములు ఉద్భవిస్తున్నాయి.

**భగవత్తత్త్వములో భేదములకు చోటు లేదు**

భగవత్తత్త్వమును మనము కేవలం ప్రేమచేతనే పొందడానికి వీలవుతుంది. భగవంతుడు ప్రేమకు వశుడైపోతాడు. ప్రేమతత్త్వముచేత భగవత్తత్త్వాన్ని ఏకత్వంగా మనము భావించాలి. "ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షిభూతం భావాతీతం త్రిగుణరహితం ..." ఇట్టి గుణాతీతుడైన భగవంతునికి అనేక గుణములు కల్పించి, ఆ భేదభావములచేత మనము తబ్బిబ్బైపోతున్నాము. అట్టి Confusionకు మనము అవకాశమివ్వకుండా దైవత్వాన్ని ఏకత్వంగా చూసుకోవాలి. రవివర్మవంటి చిత్రకారులు దైవత్వాన్ని అనేక

విధములుగా చిత్రించారు. కవులు భగవత్తత్త్వాన్ని ఎన్నోరీతులుగా వర్ణించారు. రవి, కవి – ఈ ఇరువురి ద్వారానే కొన్ని భేదములు ఏర్పడుతూ వచ్చాయి. కాని, భగవత్తత్త్వములో భేదములకు చోటులేదు. క్రమక్రమేణ మానవుల హృదయాలు మార్పుచెందుతూ రావడం చేతనే ఈ భేదభావాలు తలెత్తినాయి. మానవులయొక్క ఆహార, విహారములు పవిత్రంగా ఉన్నప్పుడు ఈ భేద భావాలకు ఏమాత్రం అవకాశముండదు; ఎక్కడ చూసినా భగవంతుడు ఒక్కడుగానే గోచరిస్తాడు.

ప్రేమస్వరూపులారా! దైవత్వానికి మీరు అనేక రూపనామములను కల్పించుకుంటూ భేదభావాలను అభివృద్ధిపరచుకొని, ఒకరితో ఒకరు వాదోప వాదములు జరుపుకుంటూ వస్తున్నారు. అది చాలా పొరపాటు. ఈవిధంగా మీరు 'డివైన్'ను 'డివైడ్' చేయకూడదు. ఏకత్వాన్ని భిన్నత్వంగా చూడకూడదు. ఈశ్వరుడన్ననూ, విష్ణువన్ననూ, రాముడన్ననూ, కృష్ణుడన్ననూ... అందరూ ఒక్కటే. ఈ పేర్లు కేవలం మన తృప్తికోసమే పెట్టుకుంటున్నాముగాని, నిజంగా భగవంతునికి ఎలాంటి భేదములూ లేవు. చైతన్యము సర్వత్రా వ్యాపించినటువంటిదేగాని, ప్రత్యేకంగా ఏదో ఒకచోట మాత్రమే ఉన్నటువంటిది కాదు. భగవంతుని యందు ఏకత్వమే తప్ప అనేకత్వము ఎక్కడా కనిపించదు. ఇలాంటి ఏకత్వాన్ని మీరు నమ్ముకొని ఆరాధన చేసుకుంటూ ఉండడం ఉత్తమమైన మార్గము. మీకు ఏ రూపము ఇష్టమో దానిని మీరు వరించండి. రాముని పూజిస్తే కృష్ణునికి కోపం వస్తుందేమో అని, కృష్ణుని పూజిస్తే రామునికి కోపం వస్తుందేమో అని భావించకండి. ఇలాంటి భేదాలు మీలోనే ఉన్నాయిగాని, రామకృష్ణులలో లేవు. వారికి కోపతాపములు ఏమాత్రం లేవు. ఈ 'నెగెటివ్' భావాలను మనస్సులో పెట్టుకొని మీరు 'పాజిటివ్' వచ్చి ప్రవేశించడానికి వీలులేకుండా చేసుకుంటున్నారు. 'నెగెటివ్' అనేది ప్రకృతి విచిత్రమే తప్ప వేరు కాదు. దైవత్వములో ఉన్నది ఒక్కటే... అదే 'పాజిటివ్'. అక్కడ 'నెగెటివ్'కి ఏమాత్రం ఛాన్సు లేదు.

విద్యార్థులారా! దైవత్వానికి భేదాలను కల్పించ కండి. ఎవరికి ఏ పేరు ఇష్టమైతే వారు ఆ పేరును ఎన్నుకోవచ్చును; ఆ రూపమును పూజించుకోవచ్చును. మీకిష్టమైన రూపనామములను ఆనందముగా ఆరాధించుకోండి.

(2005 మార్చి 8వ తేదీ శివరాత్రి సందర్భముగా సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)